Sakshi Dt 03/03/14

# జూన్‌లో 'మెట్రో' ట్రయల్ రన్

### 2015 మార్చి 21న ప్రారంభం

### సాక్షి 'ఫోన్ ఇన్'లో మెట్రోరైల్ ఎండీ

సాక్షి, సిటీబ్యూరో: నగరవాసుల కలల మెట్రో రైలు ట్రయల్‌రన్ ఈ ఏడాది జూన్‌లో ప్రారంభం కానుంది. ఉప్పల్ మెట్రో డిపో దీనికి వేదిక కానుంది. ముందుగా అనుకున్న ప్రకారమే 2015 మార్చి 21న (ఉగాది రోజున) నాగోల్-మెట్టుగూడ రూట్లో మెట్రో రైళ్లు పరుగులు తీస్తాయని హైదరాబాద్ మెట్రోరైల్ ఎండీ ఎన్వీఎస్‌రెడ్డి తెలిపారు. నాగోల్-రహేజా మైండ్ స్పేస్, జూబ్లీబస్‌స్టేషన్-ఫలక్‌నుమా, ఎల్బీనగర్-మియాపూర్ రూట్లలో మొత్తం 72 కిలోమీటర్ల మెట్రో ప్రాజెక్టును 2017 జూన్ (నిర్ణయించిన గడువు) లోగా పూర్తిచేస్తామని ప్రకటించారు. ఆదివారం 'సాక్షి' ఆధ్వర్యంలో ఆయనతో నిర్వహించిన ఫోన్‌ఇన్ కార్యక్రమానికి నగరవ్యాప్తంగా అనూహ్య స్పందన లభించింది.



పలువురు సిటీజనులు వివిధ అంశాలపై ఎండీని ఫోన్‌లో ప్రశ్నించి వివరాలు తెలుసుకున్నారు.

'సాక్షి' ఫోన్‌ఇన్ - మధ్యపేజీల్లో







మెట్రోరైల్ ఎండీ ఎన్వీఎస్‌రెడ్డి



హైదరాబాద్ కలల ప్రాజెక్ట్ మెట్రోరైలు పనులు 'కూ.. చుక్ చుక్'మంటూ పరుగులు తీస్తున్నాయి. శరవేగంగా జరుగుతున్న పనులతో పాటే ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయి. మెట్రోరైలు పనుల ప్రగతి, ట్రాఫిక్ సమస్యలపై 'సాక్షి' నిర్వహించిన ఫోన్‌ఇన్‌కు అనూహ్య స్పందన లభించింది. కొందరు మెట్రోపై ఆసక్తికరమైన ప్రశ్నలడిగితే.. మరికొందరు ట్రాఫిక్ సమస్యలను ప్రస్తావించారు. నగరవాసుల ప్రశ్నలకు మెట్రోరైల్ ఎండీ ఎన్వీఎస్‌రెడ్డి ఓపికగా సమాధానాలిచ్చారు. ఆదివారం ఉదయం 11.30 నుంచి మధ్యాహ్నం 1.30 వరకు నిర్వహించిన ఈ కార్యక్రమానికి 60 మంది ఫోన్ చేశారు. వీటిలో ముఖ్యమైన ప్రశ్నలు.. ఎండీ సమాధానాలు మీరే చదవండి.

- సాక్షి, సిటీబ్యూరో

# ట్రాఫికర్.. బేఫికర్..!



## 'సాక్షి' ఫోన్‌ఇన్‌కు అనూహ్య స్పందన

### అత్యధికం ట్రాఫిక్‌పైనే... • రెండోదశ మెట్రోపై నగరవాసుల ఆసక్తి

**ప్ర:** మెట్రో ప్రాజెక్టు రెండోదశలో పరిశీలిస్తున్న నూతన మార్గాలేమిటి?

- రవీందర్, వనస్థలిపురం

**ఎండీ:** ఎన్నికల అనంతరం ఏర్పడే నూతన ప్రభుత్వం మెట్రో ప్రాజెక్టు రెండో దశపై నిర్ణయం తీసుకుంటుంది. ప్రస్తుతం ఎల్బీనగర్-హయత్‌నగర్, నాగోల్-ఎల్బీనగర్, మియాపూర్-పటాన్‌చెరు, జేబీఎస్-అల్వాల్, రాయదుర్గం-అంతర్జాతీయ విమానాశ్రయం, ఫలక్‌నుమా-శంషాబాద్, శంషాబాద్-ఎల్బీనగర్ వంటి రూట్లలో మెట్రో రైళ్లు కావాలన్న ప్రతిపాదనలు పరిశీలనలో ఉన్నాయి.

**ప్ర:** ఉప్పల్ రింగ్ రోడ్‌లో సపోర్టింగ్ బీమ్‌లు, గడ్డర్లు, బారికేడ్లతో ట్రాఫిక్ ఇబ్బందులు తీవ్రమౌతున్నాయి? అంబేద్కర్ విగ్రహం వద్ద బారికేడ్‌లు ఇబ్బందికరంగా మారాయి?

- తరుణ్, ఉప్పల్

**ఎండీ:** తక్షణం ట్రాఫిక్ ఏసీపీని పంపించి ఈ సమస్యను పరిష్కరిస్తాం.

**ప్ర:** నాగోల్-ఎల్బీనగర్ రూట్లో మెట్రో మార్గం ఎప్పుడు నిర్మిస్తారు?

- అంజిరెడ్డి, ఎల్బీనగర్

**ఎండీ:** మెట్రో ప్రాజెక్టు రెండోదశలో ఈ మార్గాన్ని కలిపేందుకు ప్రయత్నిస్తాం.

**ప్ర:** బేగంపేట వద్ద మెట్రో స్టేషన్లను సమీప ప్రాంతాలతో ఎలా అనుసంధానిస్తారు?

- రామేశ్వర్, బేగంపేట

**ఎండీ:** స్టేషన్‌కు ఇరువైపులా ఉన్న ముఖ్యమైన భవంతులకు చేరుకునేందుకు స్కైవాక్‌లు నిర్మిస్తాం. అధునాతనమైన మెట్రో స్టేషన్ నిర్మిస్తాం.

**ప్ర:** తార్నాక ప్రాంతంలో మెట్రో పనుల వల్ల దెబ్బతిన్న రహదారుల వల్ల దుమ్ము రేగుతోంది..?

- యశ్వంత్, సికింద్రాబాద్

**ఎండీ:** త్వరలో ఈ ప్రాంతంలో దెబ్బతిన్న రహదారులను పునరుద్ధరిస్తాం. మెట్రో ప్రాజెక్టు పనులు జరుగుతున్న ప్రాంతాల్లో రూ.50 కోట్లు ఖర్చుచేసి రహదారులను విస్తరిస్తున్నాం.

**ప్ర:** మెట్రో పనులతో నేను షెల్టర్ కోల్పోయాను.. పరిహారం ఎప్పుడు ఇస్తారు?

- నాగరాజు, కూకట్‌పల్లి

**ఎండీ:** త్వరలో పరిహారం చెల్లిస్తాం.

**ప్ర:** మియాపూర్‌లో రోడ్ల విస్తరణ ఎప్పటికి పూర్తిచేస్తారు? - రాంకుమార్

**ఎండీ:** పనులు జరుగుతున్నాయి. త్వరలో పూర్తవుతాయి.

**ప్ర:** కూకట్‌పల్లి ప్రాంతంలో మెట్రో పనుల వల్ల ట్రాఫిక్ ఇక్కట్లు అధికమౌతున్నాయి?

- శ్రీనివాస్, కూకట్‌పల్లి

**ఎండీ:** అదనంగా ట్రాఫిక్ మార్షల్స్‌ను నియమించి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరిస్తాం. పనులు పూర్తయిన ప్రాంతంలో బారికేడ్‌లు తొలగిస్తాం.

**ప్ర:** కూకట్‌పల్లి బస్‌డిపో ఎదురుగా డివైడర్‌ఎత్తు ప్రమాదకరంగా మారింది?

- వి.వి.రావు, మూసాపేట

**ఎండీ:** తక్షణం దీన్ని సరిచేస్తాం. మెట్రో పనుల వల్ల ఎవరికీ అసౌకర్యం కలగకుండా చూస్తాం.

**ప్ర:** ఎర్రగడ్డ ప్రాంతంలో బారికేడ్‌లు, యూటర్న్‌లు ప్రమాదకరంగా మారాయి?

- రవినాయక్, ఎర్రగడ్డ

**ఎండీ:** అవసరమైన చోట మాత్రమే. యూటర్న్‌లు పెట్టాం. బారికేడ్‌లు ఇబ్బందిగా మారినచోట వాటిని తొలగిస్తాం.

**ప్ర:** మలక్‌పేట్ ప్రాంతంలో రహదారి విస్తరణ ఎప్పుడు చేస్తారు?

- సింధు, కొత్తపేట

**ఎండీ:** త్వరలో నోటీసులిచ్చి అడ్డుగా ఉన్న నిర్మాణాలు తొలగించి రహదారిని విస్తరిస్తాం.

**ప్ర:** కూకట్‌పల్లి ప్రాంతంలో తొలగించిన దుకాణాలను మళ్లీ కొందరు వ్యాపారులు ఏర్పాటు చేశారు?

- శ్రీనివాస్, కూకట్‌పల్లి

**ఎండీ:** జీహెచ్‌ఎంసీ సహకారంతో మళ్లీ వెలిసిన దుకాణాలను తొలగిస్తాం.

**ప్ర:** మెట్రో పనులు చేస్తున్న కార్మికులకు కనీస వేతనాలు అందించడం లేదన్న ఫిర్యాదులొస్తున్నాయి?

- భిక్షపతి, రామంతాపూర్

**ఎండీ:** కార్మిక చట్టాల ప్రకారం కనీస వేతనాలు చెల్లిస్తున్నాం. కార్మికుల భద్రతకు అధిక ప్రాధాన్యతనిస్తున్నాం.

**ప్ర:** హయత్‌నగర్ వరకు మెట్రో మార్గాన్ని ఎప్పటికి విస్తరిస్తారు?

- శ్రీతేజ, హయత్‌నగర్

**ఎండీ:** మెట్రో ప్రాజెక్టు రెండోదశలో పరిశీలిస్తాం.

**ప్ర:** మెట్రో పనుల వల్ల రసూల్‌పురా ప్రాంతంలో జాతీయ నాయకుల విగ్రహాల వద్ద చెత్తాచెదారం పేరుకుపోతోంది?

- గౌరీశంకర్, రసూల్‌పురా

**ఎండీ:** తక్షణం తొలగిస్తాం.

**ప్ర:** మెట్రో ప్రాజెక్టుల్లో స్థానికులకు ఉద్యోగాలు కల్పించడం లేదు ఎందుకు? - నాగరాజు, కూకట్‌పల్లి

**ఎండీ:** మెట్రో నిర్మాణ పనుల్లో ప్రస్తుతం బార్‌బెండింగ్, వెల్డర్ వంటి కఠినమైన పనులు చేసేందుకు ముందుకు వచ్చే స్థానిక కార్మికులకు తప్పకుండా ఉద్యోగ అవకాశం కల్పిస్తాం. ప్రస్తుతం బీహార్, జార్ఖండ్ నుంచి కార్మికులను రప్పిస్తున్నాం.





**ప్ర:** మెట్రో స్టేషన్లకు అనుసంధానంగా స్కైవాక్‌లు ఎన్నిచోట్ల ఏర్పాటు చేస్తున్నారు? - పెద్దిశెట్టి సూర్యతేజ, ఉప్పల్

**ఎండీ:** మెట్రో చుట్టుపక్కలున్న ప్రాంతాలకు నేరుగా నడిచి వెళ్లేందుకు 200 చోట్ల స్కైవాక్‌లు ఏర్పాటు చేస్తున్నాం. ప్రతి స్టేషన్ వద్ద సైకిల్ స్టేషన్లు నిర్మిస్తున్నాం.



**ప్ర:** మెట్రో స్టేషన్ల ప్రత్యేకతలు ఏమిటి? - శ్రీరాములు, సైనిక్‌పురి

**ఎండీ:** మొత్తం 72 కిలోమీటర్ల మేర ఏర్పాటవుతున్న కారిడార్లలో 66 అత్యాధునిక స్టేషన్లు ఏర్పాటు చేస్తున్నాం. టోక్యో, ఫ్రాన్స్ నగరాల రీతిలో స్టేషన్లుంటాయి. ఒక్కో స్టేషన్‌ది ఓ ప్రత్యేకత.

- మధురానగర్ స్టేషన్‌కు 'తరుణి' అనే పేరు పెడుతున్నాం. ఇక్కడ మహిళలకు కావాల్సిన అన్ని రకాల వస్తువులు షాపింగ్ చేసుకోవచ్చు.
- యూసుఫ్‌గూడ స్టేషన్ యువతకు కేటాయిస్తున్నాం.
- భరత్‌నగర్, సికింద్రాబాద్ మెట్రో స్టేషన్లలో తాజా పళ్లు, కూరగాయలు కొనుగోలు చేయవచ్చు.
- పంజగుట్ట, ఎర్రగడ్డ స్టేషన్లలో మల్టీప్లెక్స్‌లు, ఏ టు జడ్ స్టోర్లు అందుబాటులో ఉంటాయి.
- ఉప్పల్, మియాపూర్ స్టేషన్ల వద్ద పిల్లల కోసం ప్లే ఏరియా, గేమ్స్‌ను ప్రత్యేకంగా ఏర్పాటు చేస్తాం.
- సేఫ్టీపిన్స్ దగ్గరి నుంచి క్లినిక్స్, హెల్త్‌క్లబ్‌లు, ఫుడ్‌కోర్టులు, బ్యాంకులు, మందులు, నిత్యావసరాలు వంటివన్నీ స్టేషన్లలో లభ్యమౌతాయి.

**ప్ర:** ఢిల్లీ, చెన్నై, బెంగళూరు కంటే నగర మెట్రో ప్రాజెక్టు ఎందుకు భిన్నమైంది?

- సుధాకర్‌రావు, కూకట్‌పల్లి

**ఎండీ:** ఒకే పిల్లర్‌పై మెట్రో ట్రాక్, స్టేషన్ ఏర్పాటు చేస్తున్నాం. క్యూరింగ్ అవసరం లేకుండా క్యూరింగ్ కాంపౌండ్ మిశ్రమం వినియోగిస్తున్నాం. పనులు జరుగుతున్న ప్రాంతాల్లో వాహనాల రాకపోకలకు ఇబ్బందులు లేకుండా చూస్తున్నాం. రహదారులు దెబ్బతినకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నాం. అత్యాధునికమైన డిజైన్, ల్యాండ్‌స్కేపింగ్, అద్భుత ఇంజినీరింగ్ ప్రమాణాలు నగర మెట్రో ప్రాజెక్టు సొంతం.

**ప్ర:** ప్రస్తుతం మెట్రో పనులకు అయిన వ్యయం ఎంత? ఎంత శాతం పనులు పూర్తయ్యాయి? పూర్తయిన పనుల వివరాలు తెలపండి? - సుమన్, దిల్‌సుఖ్‌నగర్

**ఎండీ:** మొత్తం 16 వేల కోట్ల ప్రాజెక్టు అంచనా వ్యయంలో ప్రస్తుతానికి సుమారు రూ.4 వేల కోట్లు ఖర్చు చేశాము. మొత్తం ప్రాజెక్టులో 25 శాతం పనులు పూర్తయ్యాయి. ఇప్పటివరకు 1200 పునాదులు,1070 పిల్లర్లను ఏర్పాటు చేశాము. 700 పిల్లర్ల మధ్యన సెగ్మెంట్ల అమరిక పూర్తయ్యింది. ఉప్పల్ మెట్రో డిపో పనుల్లో 90 శాతం, మియాపూర్ డిపోలో 75 శాతం పనులు పూర్తయ్యాయి. నాగోల్-మెట్టుగూడ రూట్లో 4.5 కిలోమీటర్ల మార్గంలో మెట్రో పట్టాలు పరుచుకున్నాయి.

